నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఘట్‌కేసర్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఘట్‌కేసర్ సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ యశ్వంత్‌కుమార్ తెలిపారు. యంనంపేట్, ఇస్మాయిల్‌ఖాన్‌గూడలో ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల వరకు, కేఎల్ఆర్ కాలనీ, యంనంపేట్, ఘనాపూర్ పారిశ్రామికవాడలో ఉదయం 10.00 గంటల నుంచి 10.30 వరకు, బాలాజీనగర్‌లో 11.30 నుంచి ఒంటి గంట వరకు, కొండాపూర్‌లో మధ్యాహ్నం 12 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, అవుషాపూర్‌లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ప్రకటించారు.

సైబర్ భద్రతపై విద్యార్థులకు అవగాహన



మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టాపూర్‌లోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు అధికారులు సైబర్ భద్రతపై అవగాహన కల్పించారు. ఆర్థిక అక్షరాస్యత, రుణాలలో సిబిల్ స్కోర్ వంటి అంశాలపై మాట్లాడారు. అధికారులు శివప్రసాద్, జ్యోతిరెడ్డి, సౌందర్య, భాను, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్ డాక్టర్ రాజు, డాక్టర్ విశ్వనాథ్, ఎన్ఎస్ఎస్ కో– ఆర్డినేటర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

శాకాంబరీగా అమ్మవారు



ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని ఎన్ఎఫ్‌సీనగర్ గ్రామంలో కొలువైన కల్యాణకామేశ్వరీ అమ్మవారు శాకాంబరీ అలంకారంలో అలంకరించారు. ఆషాఢమాసం సందర్భంగా అమ్మవారిని కూరగాయలతో అలంకరించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ సందర్భంగా భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

విద్యార్థి అదృశ్యం

కాప్రా: పదోతరగతి చదువుతున్న విద్యార్థి అదృశ్యమైన ఘటన బుధవారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేతి పాండు కుమారుడు సంతోష్, కోడలు సాయిపల్లవి నిజామాబాద్ జిల్లా భైంసా నుంచి హైదరాబాద్‌కు వలస వచ్చి మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్‌లోని వేంకటేశ్వనగర్‌లో నివాసం ఉంటున్నారు. సంతోష్, సాయిపల్లవి దంపతుల 14 ఏళ్ల కుమారుడు రుషియేంద్రను ఏఎస్‌రావునగర్‌లోని భాష్యం స్కూల్‌లో చేర్పించారు. ప్రస్తుతం రుషియేంద్ర పదోతరగతి చదువుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఇంట్లో ఉన్న తాత పాండుకు సమాచారం ఇచ్చి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఇళ్ల నిర్మాణాలు జరిగేనా ?

ఇందిరమ్మ ఇళ్లకు వచ్చిన దరఖాస్తులు 1.47లక్షలు

- సొంత స్థలాలు లేకపోవటంతో ఉన్న వారికే 1800 ఇళ్లు
- నియోజకవర్గానికి 3,500 చొప్పున 17,500 మంజూరు



సాక్షి,మేడ్చల్ జిల్లా: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు యుద్ధ ప్రాతిపాదికన పూర్తయ్యేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఇన్ని రోజులుగా ఆలస్యంగా చేపట్టిన పనుల్లో వేగం పెరిగింది. జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం 1.47 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందిరమ్మ కమిటీలు, మండలాధికారుల పరిశీలన అనంతరం అధికార యంత్రాంగం ప్రతిపాదనలను నివేదించగా, జిల్లా వ్యాప్తంగా తొలి విడతలో 1800 మంది అర్హులను తేల్చారు.

◆ జిల్లాలో మొత్తం 1553 ఇళ్లు మంజూరు కాగా.. ఇప్పటి వరకు 18 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. 711 ఇళ్లు గ్రౌండింగ్ దశలోనే ఉన్నాయి. మిగతా ఇళ్లు వివిధ దశల నిర్మాణాల్లో కొనసాగుతున్నాయి. పూర్తయిన ఇళ్లకు ఆర్థికసాయం పూర్తిస్థాయిలో అందగా.. వివిధ దశల్లో ఉన్న ఇళ్లకు ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం ప్రతీ సోమవారం ఆర్థికసాయాన్ని అందజేస్తున్నారు.

పనులు వేగవంతం..

ఆషాఢమాసంలో నిర్మాణ పనులు చేపట్టేందుకు కొందరు వెనకాడుతున్నారు. అయితే మంజూరైన ఆర్థికసాయం వెనకకు వెళ్తుందేమోనని అపోహతో మరి కొందరు పనులను ప్రారంభించారు. అధికారులు కూడా క్షేత్రస్థాయిలో పర్యటించి లబ్ధిదారులను ప్రోత్సహిస్తున్నారు. కలెక్టర్, గృహ నిర్మాణశాఖ పీడీ కలిసి సంబంధిత ప్రాంతాల్లో పర్యటించి ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్నారు. వార్డు, కార్యదర్శి, మండలాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షలు నిర్వహిస్తున్నారు.

స్థలం లేకున్నా.. దరఖాస్తు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో వలస కుటుంబాలు అధికంగా ఉన్నాయి. ఇక్కడే అద్దె ఇళ్లలో నివాసం ఉంటున్న వలస కుటుంబాలతో పాటు జిల్లాలోని 16 పురపాలక సంఘాలు, జీహెచ్ఎంసీ పరిధిలోని వివిధ మున్సిపల్ సర్కిళ్లలోని బస్తీవాసులు, గ్రామిక ప్రాంతాల్లో జీవనాన్ని సాగిస్తున్న నిరుపేదలు ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలోనే 1.47లక్షల దరఖాస్తులు అందాయి.

మంజూరులో అధికారులు సతమతం..

చాలా మంది దరఖాస్తుదారులకు నివాస స్థలాలు లేకపోవడంతో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం అధికార యంత్రాంగానికి పెద్ద సమస్యగా మారింది. పురపాలక సంఘాలు, మున్సిపల్ సర్కిళ్ల పరిధిలో స్లమ్ ఏరియాలను గుర్తించడంతో పాటు ఇందులో అర్హులైన లబ్ధిదారుల ఎంపికపై మున్సిపల్ కమిషనర్లు కసరత్తు చేస్తున్నారు.

5 అసెంబ్లీ నియోజకవర్గాలు

జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా.. ఒక్కో నియోజకవర్గానికి 3,500 చొప్పున 17,500 ఇళ్లు మంజూరు కానుండటంతో ప్రస్తుతం మంజూరు చేసిన 1800 ఇళ్లు మినహాయించి మిగతా వాటిని గుర్తించిన బస్తీల్లోని అర్హులకు కేటాయించి, రీ –డెవలప్‌మెంట్ పథకం కింద వారికి అక్కడే (పాత నివాసం స్థానంలో) ఇళ్లు నిర్మించుకునేలా చర్యలు తీసుకుంటారు. ఈ మేరకు అధికారయంత్రాంగం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

ప్రభుత్వ నిబంధనల మేరకే నిర్మాణాలు

ఇప్పటివరకు 1,553 పైబడి మంజూరు పత్రాలను అందించినట్లు గృహ నిర్మాణశాఖ పేర్కొంటోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఇంటిని నిర్మాణం చేయాలన్న నిబంధనను సడలిస్తూ.. కొన్నింటినీ సరళతరం చేశారు. అయితే 400 నుంచి 600 లోపు చదరపు అడుగుల ఫీట్లు (45–65 గజాలు) స్థలంలోనే ఇంటిని నిర్మించాల్సి ఉంటుంది. అన్ని సౌకర్యాలతో అనుకూలంగా ఇంటిని నిర్మించుకోవడానికి ప్రభుత్వం అందించే రూ.5 లక్షల ఆర్థికసాయాన్ని దశలవారీగా అందిస్తారు.

ఆభరణాల వ్యాపారులకు భద్రతపై అవగాహన



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

కీసర: కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆభరణాల వ్యాపారులు, పాన్ బ్రోకర్ల యజమానులతో బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆభరణాల షోరూమ్‌లో దొంగతనాల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, షోరూమ్, బయట సీసీ కెమెరాలు, అలారం సిస్టమ్, పలు వ్యక్తిగత భద్రత తీసుకోవాలన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎస్సై వెంకటేష్, లక్ష్మణ్, నాగరాజు తదితరులున్నారు.



యజమానులతో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ రాజు

పోచారం ఐటీ కారిడార్ పీఎస్ పరిధిలో..

పోచారం: పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జువెలరీ షాపులు, పాన్ బ్రోకర్స్ దుకాణాల యజమానులతో ఇన్‌స్పెక్టర్ రాజువర్మ బుధవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఇటీవల సూర్యాపేట్‌లో జరిగిన గోల్డ్‌షాపు దోపిడీ విధానాన్ని వివరించి, అలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సీసీటీవీ కెమెరాలు, ఆభరణాలతో పాటు బిస్కెట్ బంగారాన్ని జాగ్రత్తగా కాపాడుకోవడం, పూర్తిస్థాయిలో భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు.

ఆర్టీఏ అధికారులమంటూ బెదిరింపులు !

- కేసు నమోదు చేసిన పోలీసులు
- పరారీలో నిందితులు

శామీర్‌పేట్: ఆర్టీఏ అధికారులమంటూ మూడుచింతలపల్లికి చెందిన ఓ స్థానిక నేత అతడి సోదరులు అర్ధరాత్రి వేళల్లో టిప్పర్ లారీలను అడ్డగించి డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నారు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారిపై కేసు నమోదైంది. వివరాల ప్రకారం.. మూడుచింతలపల్లి మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కీసరి భానుచందర్‌తో పాటు సోదరులు వేణు, రాజులు మంగళవారం అర్ధరాత్రి ఉప్పర్‌పల్లి నుంచి యాదగిరిగుట్ట వైపు వెళ్తున్న టిప్పర్‌లారీని మూడుచింతలపల్లి వద్ద నిలిపి, ×మేము కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులమని, సీఎం, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌కు ప్రధాన అనుచరులమంటూ బెదిరించారని₹, అంతేకాకుండా డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయగా.. తాము ఇవ్వకపోవడంతో తమపై దాడికి పాల్పడ్డారని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా సైరన్ వాహనం ఎవరిది, ప్రస్తుతం ఈ వాహనం ఎవరు వాడుతున్నారనే వివరాలు తెలియాల్సి ఉంది. కాగా విషయంపై శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌ను వివరణ కోరగా ఫిర్యాదు అందిన విషయం వాస్తవమేనన్నారు, పొన్నాల గ్రామానికి చెందిన రామాంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు భాను, వేణు, రాజులపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నామన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో రెండోసారి..

– పట్టుబడిన డ్రైవర్‌కు జైలుశిక్ష

మేడ్చల్: మద్యం సేవించి వ్యాన్ నడిపిన డ్రైవర్‌కు మేడ్చల్ కోర్టు జైలు శిక్ష విధించింది. మేడ్చల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ హనుమాన్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. జాతీయ రహదారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ చేయగా.. డీసీఎం డ్రైవర్ మద్యం సేవించి వాహనాన్ని నడుపుతున్నట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మేడ్చల్ 7వ స్పెషల్ ఎంఎం ప్రత్యేక కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 4 రోజుల జైలు శిక్ష, రూ.4 వేల జరిమానా విధించారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఇతడు రెండోసారి డంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడినట్లు చెప్పారు. దీంతో అతడిని చర్లపల్లి కారాగారానికి తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

లోతట్టు ప్రాంతాల్లో పర్యటన

జవహర్‌నగర్: కార్పొరేషన్ పరిధిలో కురిసిన భారీ వర్షాలకు పాపయ్యనగర్ కాలనీలోని లోతట్టు ప్రాంతాలు వరద నీటితో చెరువును తలపించాయి. విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, మున్సిపల్ అధికారులతో కలిసి బుధవారం లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. మున్సిపల్ సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



సికింద్రాబాద్: మేడ్చల్ రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ పండరి తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ రైల్వేస్టేషన్ 4వ నెంబర్ ప్లాట్‌ఫామ్‌పై ఒక వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గుర్తించిన రైల్వే పోలీసులు అంబులెన్స్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. పరీక్షించిన సిబ్బంది అతడు అనారోగ్యంతో మృతి చెందినట్లు చెప్పారు. మృతుడికి సంబంధించిన వివరాలు లభ్యం కాలేదు. మృతుడికి సుమారు 45 ఏళ్లు ఉంటాయని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించామన్నారు. వివరాలకు 8712568516.

యువకుడి అదృశ్యం



ఇంతియాజ్ పాషా

జవహర్‌నగర్: ఓ యువకుడు అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ కార్పొరేషన్ దివ్యాంగుల కాలనీలో నివసించే షేక్ సబిహా పెద్ద కుమారుడు ఇంతియాజ్‌పాషా (25) ఈనెల 16న బ్యాంకుకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి తిరిగిరాలేదు. ఆచూకీ కోసం తెలిసిన చోట్ల వెతికినా లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలు

ఘట్‌కేసర్: ఏదులాబాద్ గోదాసమేత మన్నారు రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి డిసెంబర్ 31 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు ప్రకటించారు. ఈనెల 24న విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రుత్విక్ వరణం, 31న స్వామివారి ఘటాభిషేకం, మహదాశీర్వాచనంతో బ్రహ్మోత్సవం ముగుస్తుందని తెలిపారు.

పక్కా ఇళ్లు నిర్మించుకునేలా ఒప్పించాలి

తహసీల్దార్లు, కమిషనర్లను ఆదేశించిన కలెక్టర్ మనుచౌదరి



సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ స్థలాలలోని స్లమ్ ఏరియాల పరిధిలోని ఇళ్లలో నివసించే పేద వారిని గుర్తించి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జీప్లస్ 3, 4 అంతస్తులలో పక్కా ఇళ్లు నిర్మించుకునేలా ఒప్పించాలని తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లను జిల్లా కలెక్టరు మిక్కిలినేని మనుచౌదరి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ వీసీ హాల్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు రాధికగుప్తా, విజయేందర్‌రెడ్డిలతో కలసి సంబంధిత అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. స్లమ్ ఏరియాల్లో ఇళ్లను నిర్మించే బాధ్యతను ప్రభుత్వమే తీసుకుంటుందన్న విషయంపై వారికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన బాధ్యత కూడా తహసీల్దార్లపైన్నే ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. రెవెన్యూ యంత్రాంగమంతా కలిసికట్టుగా ప్రభుత్వ భూముల పరిరక్షణకు నడుంబిగించాలన్నారు.

◆ భూదాన్ ల్యాండ్‌లను గుర్తించి నివేదికను పంపాలని తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లకు కలెక్టర్ మనుచౌదరి సూచించారు. స్లమ్‌ల అభివృద్ధిలో భాగంగా అక్కడ ప్రజలకు అవసరమైన కనీస వసతులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లలో లబ్ధిదారులే ఉంటున్నారా లేదా ఇతరులు ఉంటున్నారానన్న విషయాన్ని గుర్తించాలన్నారు. కేటాయించిన ఇళ్లను అద్దెకు ఇచ్చారన్న విషయాలపై పూర్తిస్థాయిలో నివేదిక అందించాలన్నారు. అవసరమైతే సంబంధితులకు నోటీసులు జారీ చేయాలని కలెక్టరు ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులతో కలిసి ఒక బృందంగా ఏర్పడి క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదికలు పంపాలన్నారు. భూభారతిలో భాగం రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులపై సమీక్షి నిర్వహించి, అవసరమైన వారికి నోటీసులు జారీ చేయాలని కలెక్టరు ఆదేశించారు.

నీళ్లు నిలువకుండా చర్యలు తీసుకోండి..

వర్షపు నీళ్లు నిలువకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వర్షపు నీరు నిలువ ఉండే స్థలాలను గుర్తించి నిరంతరం మానిటరింగ్ చేయాలన్నారు. మెడికల్ ఆఫీసర్ల సమన్వయంతో ఇంటింటికీ ఫీవర్ సర్వే జరిగేలా చూడాలన్నారు. రేషన్ కార్డులు ఎక్కువ సంఖ్యలో పెండింగ్‌లో ఉన్న చోట డీఎస్ఓ సమన్వయంతో అవసరమైతే అదనపు లాగిన్ ఐడీలు తీసుకొని పెండింగ్‌ను క్లియర్ చేయాలన్నారు. భారీ వర్షాల సందర్భంగా స్కూల్స్, కార్యాలయాలు, కాలేజీలు, మండల భవనాలను పునరావాస కేంద్రాలుగా ఏర్పాటు చేయాలన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లు, ఇతర నిర్మాణాలను ముందుగా గుర్తించి, ప్రాణనష్టం జరుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలలో మిడ్ డే మీల్స్, వంట సామగ్రిని తరచుగా పరిశీలించాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు. కొత్త మున్సిపాలిటీలలో ప్రజల అవసరాలకు సంబంధించిన ప్రతిపాదనలు ఉంటే.. నివేదించాలని సూచించారు. నిర్ణీత ప్రొఫార్మాలలో కోర్టు కేసులకు సంబంధించిన వివరాల జాబితాను పంపాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్ఓ హరిప్రియ, ఆర్డీఓలు ఉపేందర్‌రెడ్డి, శ్యాం ప్రకాష్, లా ఆఫీసర్ చంద్రావతి, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

దేశభక్తిని పెంపొందించేందుకు ఎన్‌సీసీ దోహదం



లెఫ్టినెంట్ కల్నల్ పాండ్యన్‌కు జ్ఞాపికను బహూకరిస్తున్న స్కూల్ చైర్మన్

పోచారం: విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, దేశభక్తిని పెంపొందించేందుకు ఎన్‌సీసీ దోహదపడుతుందని లెఫ్టినెంట్ కల్నల్ కే.ఎస్.పాండ్యన్ అన్నారు. బుధవారం యంనంపేట్‌లోని రాక్‌వుడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఎన్‌సీసీ ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఎన్‌సీసీ జెండాను ఎగురవేసి గౌరవ వందనం స్వీకరించారు. పాండ్యన్ మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు పట్ల విద్యార్థుల పాత్రను గుర్తు చేశారు. ఎన్‌సీసీలో శిక్షణ తీసుకుంటే డిఫెన్స్, పారామిలటరీ దళాల్లో ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. లెఫ్టినెంట్ కల్నల్ పాండ్యన్‌కు స్కూల్ చైర్మన్ రామానాయుడు జ్ఞాపికను బహూకరించి ఘనంగా సత్కరించారు. సీఈఓ సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్ దివ్యశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'ఐడియాథాన్- 2కె25'



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ×ఐడియాథాన్ 2కె25₹ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సాగిన కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని సవాళ్లను ఎదుర్కొనే కొత్త పరిష్కారాలు, ప్రత్యేక ఆలోచనలు ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్అండ్‌డీ డీన్ అంజాన్‌షేక్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం

మేడ్చల్: విద్యాహక్కులు, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ బుధవారం నిర్వహించిన విద్యా సంస్థల బంద్ విజయవంతమైనట్లు ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. కొన్ని విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించగా.. కొన్నింటినీ ఎస్ఎఫ్ఐ నాయకులు బంద్ చేయించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు కిరణ్, సాయి, రామునాయక్, భరత్, బాలకిరణ్ తదితరులు పాల్గొన్నారు.



రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



సాక్షి, మేడ్చల్ జిల్లా: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్లు వరంగల్ రైతు డిక్లరేషన్ హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా డిమాండ్ చేసింది. బుధవారం మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట రైతులు ఆందోళన చేశారు. ఎలాంటి ఆంక్షలు విధించకుండా మేనిఫెస్టోలో పేర్కొన్నట్లు రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని కోరారు. వరి, మొక్కజొన్న, కందులు, సోయాబీన్, పత్తి, మిర్చి, పసుపు, ఎర్రజొన్న, చెరకు, జొన్న పంటలకు రూ. 600 బోనస్ చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుభరోసా ఎకరాకు రూ.15 వేలతో పాటు కౌలు రైతులకు కూడా భరోసా సాయాన్ని వర్తింపజేయాలన్నారు. ధర్నా అనంతరం జిల్లా కలెక్టర్ మనుచౌదరికి వినతిపత్రం అందజేశారు. పటోళ్ల విక్రంరెడ్డి, జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్‌పటేల్, భారతీయ కిసాన్ మోర్చా నాయకులు రాజిరెడ్డి, దేవర శ్రీనివాస్, తిరుమలరెడ్డి, అమరం మోహన్‌రెడ్డి, విఘ్నేశ్వర్, మల్లారెడ్డి, కృష్ణగౌడ్, కృష్ణ, రాంచంద్రారెడ్డి, సుధాకర్, మహిపాల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, బాలేష్, నాగరాజు, కమలాకర్, జోగారావు, మహేందర్, మహేష్ పాల్గొన్నారు.

సద్భావన టౌన్‌షిప్ నివాసానికి అనుకూలం



మాట్లాడుతున్న ప్రభుత్వ కార్యదర్శి గౌతమ్

పోచారం: ప్రభుత్వం నిర్మించిన సద్భావన టౌన్‌షిప్ నివాసానికి ఎంతో అనుకూలంగా ఉంటుందని ప్రభుత్వ కార్యదర్శి, రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఎండీ వీపీ.గౌతమ్ అన్నారు. బుధవారం పోచారంలోని సద్భావన టౌన్‌షిప్‌ను ఆయన సందర్శించిన ఆయన మాట్లాడుతూ.. టౌన్‌షిప్‌ను 30 ఎకరాల విస్తీర్ణంలో 60 శాతం ఖాళీ ప్రదేశాలు, విశాలమైన రోడ్లు, అన్ని వైపుల నుంచి వెంటిలేషన్, అవసరానికి మించిన సెట్‌బ్యాక్‌లతో అపార్ట్‌మెంట్లను నిర్మించామన్నారు. ఉడ్‌వర్క్‌తో రూ.13 లక్షలకే 1బీహెచ్‌కే, రూ.25 లక్షలకే 2బీహెచ్‌కే అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రభుత్వం నిర్మించిన అపార్టుమెంట్లలోని ఫ్లాట్లలో కేవలం 10 శాతమే కామన్ ఏరియా ఉంటుందన్నారు. 516 ఎస్ఎఫ్‌టీతో 1బీహెచ్‌కే 255 ఫ్లాట్లు, 900 నుంచి 1000 ఎస్ఎఫ్‌టీ వరకు 2బీహెచ్‌కే ఫ్లాట్లు 350 అమ్మకానికి ఉన్నాయన్నారు. కొనుగోలుదారులకు బ్యాంకు రుణాలు మంజూరు చేస్తున్నాయన్నారు. ఎస్ఈ భాస్కర్‌రెడ్డి, ఈఈ నరేందర్‌రెడ్డి, డీఈ వెంకట్‌రెడ్డి, ఏఈ అప్పలరాజు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారికి చేయూత



బోడుప్పల్: ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారికి చేయూతనిద్దామని కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్ అన్నారు. బోడుప్పల్‌లో ఆర్థికఇబ్బందుల్లో ఉన్న నరేష్ కుటుంబానికి మాజీ మంత్రి కేటీఆర్ జన్మదినం సందర్భంగా తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్‌సాగర్ 'గిఫ్ట్ ఏ స్మైల్'లో భాగంగా స్టీల్ ఫర్నిచర్, వెల్డింగ్‌వర్క్స్ ఏర్పాటుకు ఆయన సహకరించి, ప్రారంభోత్సవానికి ఆయన హాజరై బుధవారం ప్రారంభించారు. పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి, బోడుప్పల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి, ఎస్ఎస్ఏ ట్రస్ట్ చైర్మన్ సాయి, బీఆర్ఎస్ నేతలు శ్రీనివాస్‌రెడ్డి, రాసాల మహేష్‌యాదవ్, వేణు, ప్రకాష్‌రెడ్డి తదితరులున్నారు.

బంగారు దుకాణదారులతో పోలీసుల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ గోవిందరెడ్డి

మేడిపల్లి: మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బంగారు దుకాణదారులతో మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. బుధవారం మేడిపల్లి ఇన్‌స్పెక్టర్, క్రైమ్ ఇన్‌స్పెక్టర్, మేడిపల్లి పలు సెక్టార్ల ఎస్సైలతో సమావేశం నిర్వహించారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా బంగారుషాపు యజమానులకు అవగాహన కల్పిస్తూ.. తప్పనిసరిగా సీసీకెమెరాలు, అలారం ఏర్పాటు చేసుకోవాలన్నారు. లాకర్లను సేఫ్టీగా పెట్టుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అపరిచిత వ్యక్తులు, అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

స్ట్రీట్‌ఫుడ్ ఫెస్టివల్ ప్రారంభం



మేడిపల్లి: పీర్జాదిగూడ నగరపాలక సంస్థ పరిధిలోని స్వయంసహాయక సంఘాలు, మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్‌ను కార్యాలయ సిబ్బంది, ఆర్పీలతో కలిసి బుధవారం కమిషనర్ త్రిలేశ్వర్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలకు ఆదాయం, గుర్తింపుతో పాటుగా మార్కెట్‌లో రాణించుటకు గొప్ప అవకాశమన్నారు. 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. వీధి ఆహార విక్రయంలో పిండి వంటలు, మిల్లెట్స్, ఆర్గానిక్ ప్రొడక్ట్స్, చేతివృత్తుల వస్తువులు అల్లికలు, వివిధ రకాల పచ్చళ్లు ఉన్నట్లు తెలిపారు. ఈనెల 25 వరకు జరిగే ఈ స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్‌ను సందర్శించి స్వయం సహాయక బృందాలను ప్రోత్సహించాలని నగర ప్రజలను కోరారు. అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శోభాశంకర్, డిప్యూటీ ఈఈ సాయినాథ్‌గౌడ్, ఏఈ వినిల్‌కుమార్‌గౌడ్, మేనేజర్లు క్రాంతికుమార్, కిషోర్, ఎస్సై ప్రవీణ్‌కుమార్, బాలమురళీకృష్ణ, మున్సిపల్ సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.